క్లుప్తంగా

మోగిన బడి గంట



పాఠశాలకు హాజరైన విద్యార్థులు

వాల్మీకిపురం: మండల వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థులు మొదటి రోజే పాఠశాలలకు హాజరయ్యారు. సెలవుల్లో ఆటపాటలతో హాయిగా గడిపిన పిల్లలు ఇప్పుడు అవన్నీ వదిలిపెట్టి పాఠశాలలకు వెళ్తున్నారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పీలేరు : మాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ)ల ద్వారా గురువారం విత్తనాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మాస్ డైరెక్టర్ వినాయకరెడ్డి మాట్లాడుతూ 2019లో ప్రారంభమైన పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘంలో 800 మంది రైతులు సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. సంఘం ద్వారా రైతులకు తక్కువ ధరలతో నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అందిస్తున్నట్లు చెప్పారు. వేరుశెనగ వేస్తున్న రైతులకు అంతర్‌పంటగా ఐదు రకాల విత్తనాలు 50 మందికి, పేరటి తోటకు సంబంధించి పది రకాల విత్తనాలు 500 మందికి, పచ్చరొట్ట ఎరువు కింద 27 రకాల విత్తనాలు 200 మందికి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజరు డాక్టర్ భార్గవి, సీఈఓ ప్రత్యూష, బోదేషావలి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మొక్కలు నాటుతున్న ఎంఈఓలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి

కేవీపల్లె : విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఎంఈఓలు పి. రెడ్డిబాషా, డి. సుబ్రమణ్యంరెడ్డి పిలుపునిచ్చారు. మిషన్‌లైఫ్ యాక్టివిటీస్‌లో భాగంగా గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో విద్యార్థులతో నేచర్ వాక్ నిర్వహించి ప్రకృతి సమతుల్యత, పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా రాయాలి

తంబళ్లపల్లె: మహిళా సంఘాలు మండల సమాఖ్య ఎఫ్‌పీఓ గ్రామ సమాఖ్య సభ్యులు రికార్డులు సక్రమంగా రాసుకున్నప్పుడే అనుమానాలకు చోటు ఉండదని ఆడిటర్ నాసిఫ్ తెలిపారు. గురువారం స్త్రీ శక్తి భవన్‌లో ఆడిటింగ్ నిర్వహించారు. మండల సమాఖ్య ఎఫ్‌పీఓ, వీఓ సంఘాల రికార్డులు పరిశీలించారు. బ్యాంకు రుణాలు, తిరిగి చెల్లింపు, జమా ఖర్చు తదితర అంశాలపై తనిఖీ చేశారు. డీఎంజీ మల్లయ్య, సీసీలు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు మోకాళ్లపై వెళ్లిన భక్తుడు



మల్లకొండకు మోకాళ్లపై వెళ్తున్న బయ్యప్ప

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి కోరిన కోర్కె తీర్చడంతో పెండేరివారిపల్లెకు చెందిన బయ్యప్ప గురువారం మల్లయ్యకొండకింద నేలమల్లేశ్వర స్వామి ఆలయంలో ఉదయం పూజలు చేసి అక్కడి నుంచి మోకాళ్లపై ఊతకర్ర సాయంతో కొండకు వెళ్లారు. సాయంత్రానికి ఆలయానికి చేరుకోవడంతో పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మండల సమావేశం వాయిదా

బి.కొత్తకోట : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు కోరం లేకపోవడంతో వాయిదా వేశామని ఎంపీడీఓ సూర్జహాన్ తెలిపారు. గురువారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. దీంతో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ హాజరయ్యారు. అయితే మధ్యాహ్నం ఒంటిగంట అయినా మండల మీట్ నిర్వహించేందుకు అవసరమైన ఎంపీటీసీ సభ్యుల కోరం లేకపోయింది. ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో మండల సమావేశం జరగలేదు. దీనితో వాయిదా వేశామని ఎంపీడీఓ తెలిపారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం



మదనపల్లె సిటీ: బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది



పీలేరు : బీసీజీ టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉషశ్రీ

- ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి నయం
- బీసీజీ టీకా సురక్షితం
- డీఐఓ డాక్టర్ ఉషశ్రీ

పీలేరు : క్షయ రహిత సమాజమే లక్ష్యమని జిల్లా వ్యాధినిరోధక టీకాల నిర్వహణాధికారి (డీఐఓ) డాక్టర్ ఉషశ్రీ అన్నారు. గురువారం బోడుమల్లువారిపల్లె సచివాలయ పరిధిలోని మణికంఠనగర్‌లో నిర్వహిస్తున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దలకిచ్చే బీసీజీ టీకా సురక్షితమైందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్‌ఎం రేణుక, సీహెచ్‌వో రాజేశ్వరి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ లేని సమాజం కోసం..

కలికిరి: క్షయ వ్యాధి లేని సమాజం కోసమే పెద్దలకు బీసీజీ టీకాలు వేస్తున్నట్లు హెచ్ఈ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి అన్నారు. మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో జరుగుతున్న బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన షుగర్, బీపీ ఉన్నవారు, మద్యం, పొగ అలవాటు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. ప్రతి సోమ, గురువారాల్లో టీకా వేయడం జరుగుతుందని, 18 ఏళ్ల లోపు వారు బరువు తక్కువున్నవారు కూడా టీకా వేయించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో 10 మంది సిబ్బందికి టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌హెచ్ హేమలత, ఎంఎల్‌హెచ్‌పీలు సైరాభాను, గీత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అపోహలు వద్దు

వాల్మీకిపురం: టీబీ రాకుండా వేస్తున్న బీసీజీ టీకాపై అపోహలకు గురికావద్దని ఎంఎల్‌హెచ్‌పీ అమృత, ఎఎన్‌ఎం సరోజమ్మ అన్నారు. గురువారం నగిరిమడుగు పీహెచ్‌సీ పరిధిలోని వాల్మీకిపురం 1 సచివాలయంలో బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లపైబడి టీబీ, షుగర్, టీబీ వచ్చి నయం అయిన వారికి, టీబీ మందులు వాడుతున్న వారు వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ స్వరూప, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

వెలుగు వృద్ధాశ్రమంలో..

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు వృద్ధాశ్రమంలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. బొమ్మనచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఫరూక్‌ఖాన్ వాక్సినేషన్ వేశారు. వృద్ధాశ్రమంలోని 40 మంది వృద్ధులు, సిబ్బంది 23 మందికి వ్యాక్సినేషన్ వేయించుకున్నట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సోమాలి, ఎంపీహెచ్ఈఓ రహమాన్, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



కలికిరి : పోలీస్ స్టేషన్‌లో టీకా వేసుకున్న సిబ్బందితో వైద్య సిబ్బంది



వాల్మీకిపురం: బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

దివ్యాంగులకు స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించాలి

రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని దివ్యాంగులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లు కట్టించాలని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దివ్యాంగులకు బ్రతుకుదెరువు కోసం రెండు ఎకరాలు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ప్రభుత్వ బంజర భూములు ఇచ్చి, బోర్లు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతి నెలా 7 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నడవలేక మంచానికి పరిమితమైన ప్రతి దివ్యాంగుడికి రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు సబ్సిడీ కింద రూ. 2లక్షల వరకు ఇవ్వాలని కోరారు. ప్రతి దివ్యాంగుడికి పర్సెంటేజీతో సంబంధం లేకుండా స్కూటీలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే మెరుగైన వైద్యం కోసం 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు.

అడ్మిషన్లు ప్రారంభం

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. బీఎస్సీ (హానర్స్) కోర్సుల్లో (జువాలజీ సింగల్ మేజర్, బాటనీ మైనర్), కంప్యూటర్స్ సింగల్ మేజర్, మ్యాథ్య్ మైనర్), బికాం హానర్స్‌లో బికాం (సీఏ), బికాం (జనరల్), బి.ఎ (హానర్స్)లో పొలిటికల్ సైన్సు సింగల్ మేజర్, ఎకనామిక్స్ మైనర్, స్పెషల్ తెలుగు, బి.ఎ (హానర్స్) ఉర్దూ మీడియంలో (హిస్టరీ సింగల్ మేజర్, పొలిటికల్ సైన్సు మైనర్) సబ్జెక్టులు ఉన్నాయని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న హెచ్‌ఎం అంజాద్ అలీఖాన్

నిమ్మనపల్లె : మండలంలోని నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్ (తెలుగు) పాఠశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీఖాన్ ఘనంగా సన్మానించారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 1973–74 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు రూ.3 లక్షలతో పాఠశాల సభావేదికకు 3,950 చదరపు అడుగుల్లో గ్రానైట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అంజాద్ అలీఖాన్ వారిని అభినందిస్తూ... విద్యను అభ్యసించిన పాఠశాలను 51 సంవత్సరాలు అయినప్పటికీ మరచిపోకుండా అభివృద్ధికి సహకరించిన పూర్వవిద్యార్థుల దాతృత్వం మరువలేనిదని కొనియాడారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ఇతర పాఠశాలల పూర్వవిద్యార్థులు సహకారం అందిస్తే, పాఠశాలల్లో అన్ని వసతులు సమకూరుతాయన్నారు. సన్మాన గ్రహీతల్లో బి.నారాయణ, జి.రాజారెడ్డి, చిన్నపరెడ్డి, డాక్టర్.మునిశంకరయ్య, కే.నాగరాజ, పి.వెంకటరమణారెడ్డి ఉన్నారు.

మూకుమ్మడి రాజీనామా

మదనపల్లె : వ్యవసాయ మార్కెట్ కమిటీ, మదనపల్లె, పాలకమండలి చైర్మన్, సభ్యులు గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్‌చైర్మన్ వెంకటేష్‌బాబు, సెక్రటరీ అభిలాష్‌ను కలిసి రాజీనామా లేఖలు సమర్పించారు. మార్కెట్ కమిటీ మెంబర్స్ బి.లక్ష్మీదేవి, ఏ.వి.అపర్ణ, సి.సుమ, సి.పి.రమణప్ప,సి.బయన్న,జయమ్మ, బి.శంకరనాయక్, మేకల రేణుక, జి.రెడ్డెమ్మ, రెడ్డిపల్లి ఆశా, షేక్‌ప్యారేజాన్, ఎస్.మాధవరెడ్డి, టి.గంగులరెడ్డి రాజీనామలు చేసిన వారిలో ఉన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి



మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చిట్వేలి : ప్రజాప్రతినిధులు అధికారులను సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధి చేయాలని ఎంపీపీ టంగుటూరి చంద్ర కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీపీ సభా భవనంలో ఎంపీపీ టంగుటూరి చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధిని శాఖలవారీగా వివరించారు. సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ మండలంలో అనాథ పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం తరఫున వసతి, విద్యను అందిస్తామన్నారు. ఎస్‌ఐ సుధాకర్ మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాలకు గురి కావడమే కాకుండా నూరేళ్ల జీవితాన్ని అంధకారంలో నెట్టుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. చిట్వేలి, కోడూరు రహదారి పనులు జరుగుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా వాహనాలు నడపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎల్‌వీ మోహన రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ వెంకట రంగారావు, అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ



పెద్దతిప్పసముద్రంలో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు వెంకటరత్నం, వెంకటలక్ష్మి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం తెరచుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలకు 2024–2025 నూతన విద్యా సంవత్సరంకు సంబంధించి ప్రభుత్వం ద్వారా మంజూరైన 23 వేల పాఠ్య పుస్తకాలను ఎంఈఓ నారాయణ, ఎంఈఓ–టూ గౌస్‌పీర్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. మండలానికి ఇంకా ఆరు వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందని ఎంఈఓలు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెద్దతిప్పసముద్రం మోడల్ స్కూల్‌ను గురువారం ఎంఈఓ నారాయణ ఎంఈఓ–టూ గౌస్‌పీర్ తనిఖీ చేశారు. అడ్మిషన్ల సంఖ్య, ఖాళీల వివరాలను ప్రిన్సిపాల్ శివకుమారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలించారు. మెనూ పాటిస్తూ నాణ్యమైన భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

వాల్మీకిపురం: మండల వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రారంభం రోజే మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి మండలంలోని 64 పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ 1 వెంకటరత్నం, ఎంఈఓ 2 వెంకటలక్ష్మి చేతుల మీదుగా ఎంపీపీ, ఎంపీయూపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేత

కేవీపల్లె : మండలంలోని అన్ని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేసినట్లు ఎంఈఓలు పి.రెడ్డిబాషా, డి. సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రం నుంచి అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు సరఫరా చేసే వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి వి.గాయత్రి



లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సమీక్షిస్తున్న జడ్జి వి.గాయత్రి

సిద్దవటం : సిద్దవటం–భాకరాపేట ప్రధాన రహదారిలో ఉన్న పరమాత్మా సేవా వృద్ధాశ్రమంలో గురువారం మండల లీగల్ సర్వీస్ కమిటీ అధ్యక్షతన ఆశ్రమంలోని వృద్ధులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించామని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వృద్ధుల ఆరోగ్య సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నామన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ప్రతి ఒక్కరూ చేయూతను ఇవ్వాలన్నారు. అనంతరం జడ్జి వృద్ధులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

ఈనెల 29వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిద్దవటం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వి.గాయత్రి పిలుపునిచ్చారు. సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం ఆమె కోర్టులో క్రైమ్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దవటం, ఒంటిమిట్ట, అట్లూరు పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు ఇతర కేసులను కక్షిదారులు పరిష్కరించుకొని లోక్ ఆదాలత్‌లో రాజీపడి తమ విలువైన సమయాన్ని, డబ్బులను ఆదా చేసుకోవాలని ఆమె సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీపడితే అది ఫైనల్ అని తరువాత ఎటువంటి అప్పీళ్లకు వెళ్లేందుకు అవకాశం ఉండదన్నారు. కావున కక్షిదారులందరూ ఈ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్‌ఐ పెద్ద ఓబన్న, ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

విచ్చలవిడి ఫీజుల దోపిడీపై పోరాటం



డీఈఓ కార్యాలయం ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు చేస్తున్న విచ్చలవిడి ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలని, లేకుంటే పోరాటం చేస్తామని అన్నమయ్య జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవ్, కోటేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఏడీ ప్రసాద్‌బాబును వారు కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, యూనిఫాం ఫీజు, హాస్టల్ ఫీజు తదితరాల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారంటూ ఆరోపించారు. అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన చేయిస్తూ నాణ్యమైన విద్యనందించడం లేదన్నారు. పైగా మెరుగైన మార్కుల కోసం తీవ్రమైన ఒత్తిడి తెస్తుండడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటూ చెప్పారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్లను వెంటనే మూయించి వేయాలన్నారు.నేతలు సతీష్‌నాయక్, వాసుదేవ నాయక్, కుమార్‌నాయక్, నరేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

నీట్ పలితాలపై విచారణ జరిపించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : నీట్ పరీక్షా ఫలితాలలో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపించాలని ఆర్ఎస్‌యూ జిల్లా కార్యదర్శి వంశీరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలన్న డిమాండ్‌తో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ ఫలితాల్లో 57 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు వచ్చి జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం, ఇందులో ఒకే సెంటర్‌లో 7 మంది విద్యార్థులు ఉండడం అనేక అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. జూన్ 14న విడుదల కావలసిన నీట్‌పరీక్షా ఫలితాలను హడావిడిగా జూన్ 4న విడుదల చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. వెంటనే నీట్ పరీక్షల నిర్వహణపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో నీట్ పరీక్షల ఫలితాలను వెంటనే రద్దు చేయాలంటూ వారు డిమాండ్ చేశారు. విచారించి నిందితులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నేతలు చరణ్, ప్రతాప్, మధుసూదన్, నవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.